# 65. అత్ తలాఖ్ ( విడాకులు) సూరా

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందినది. ఇందులో 12 ఆయతులు ఉన్నాయి. ఇది ముఖ్యంగా విడాకుల గురించి ప్రస్తావించిన అధ్యాయం. మొదటి ఆయత్‌లో వచ్చిన పదాన్నే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. ఈ సూరా కుటుంబ బంధాల ప్రాముఖ్యాన్ని చాటి చెప్పింది. వివాహ మర్యాదను కాపాడాలని, తొందరపడి విడాకుల నిర్ణయానికి రాకూడదని బోధిస్తూ, ఆ విధంగా హక్కులకు భంగం కలిగే పరిస్థితిని నివారించింది. ఇస్లామ్ అనుమతించిన వాటన్నింటిలోను అల్లాహ్‌కు అత్యంత అయిష్టమైన చర్య విడాకులు. కాని అందుకు అనుమతి ఇవ్వబడింది. గృహ సంబంధమైన ఇలాంటి వ్యవహారాల్లో దేవునిపట్ల భక్తితో, దేవుని పట్ల భయంతో వ్యవహరించాలని, తమ నిర్ణయాన్ని ఒకటికి రెండుసార్లు పునరాలోచించుకోవాలని విశ్వాసులను ఈ విషయమై హెచ్చరించడం జరిగింది. భార్యకు విడాకులిచ్చే హక్కు భర్తకు ఉంది. కాని విడాకులన్నవి సరియైన పద్ధతిలో, సరియైన సమయంలో ఇస్లామీయ చట్టం ప్రకారం జరగాలి. ఎలా అంటే :

- భార్య రుతుకాలంలో ఉన్నప్పుడు విడాకులు ఇవ్వరాదు.
- నిర్దిష్ట సమయం గడిచేవరకు ఆమెను ఇంటినుంచి బలవంతంగా బయటకు పంపరాదు. నిర్ధిష్ట సమయం (ఇద్దత్) మూడువిధాలుగా ఉంటుంది.
- ఈ నిర్దిష్ట కాలంలోనూ, గర్భంతో ఉన్న కాలంలోను భర్త తన భార్యపోషణకు ఖర్చు చేయాలి.
- శిశువు జన్మించిన తర్వాత భర్త తాను విడాకులిచ్చిన భార్య కొరకు వేరుగా నివాస వసతి ఏర్పాటు చేయాలి.
- విడాకులిచ్చిన భార్య శిశువుకు పాలుపట్టడానికి అంగీకరిస్తే, అందుకు భర్త తగిన పారితోషికం చెల్లించాలి.
- పాలుపట్టే విషయంలో వారిద్దరి మధ్య ఎలాంటి అంగీకారం కుదరనట్లయితే, వేరే మహిళతో పాలుపట్టించే ఏర్పాటు చేయాలి.

# 65. అత్ తలాఖ్ సూరా

# سُورَةُ الطَّلَاقِ

అవతరణ : మదీనా ఆయతులు :12

అపారకరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 ఓ ప్రవక్తా! (నీ అనుచర సమాజానికి చెప్పు) మీరు మీ స్త్రీలకు విడాకులు ఇస్తున్నప్పుడు[1] వారి గడువు (ఇద్దత్) ప్రకారం విడాకులివ్వండి.[2] 'గడువు'

يٰٓاَيُّهَا النَّبِيُّ اِذَا طَلَّقْتُمُ النِّسَآءَ فَطَلِّقُوْهُنَّ لِعِدَّتِهِنَّ وَاَحْصُوا

1. ప్రవక్త (సఅసం) గారి స్థాయి దృష్ట్యా ఆయన్ని ఉద్దేశించి ఈ సూచనలు ఇవ్వబడినప్పటికీ, నిజానికి ఇవి యావత్తు ముస్లిం సమాజానికి ఇవ్వబడిన దైవాదేశాలు. లేదా ప్రవక్త (సఅసం) ఆచరణ సమస్త ముస్లిం జగతికి ఆదర్శప్రాయం కావటం వల్ల కేవలం ఆయన్ని మాత్రమే ఉద్దేశించి ఈ ఆజ్ఞలు వచ్చి ఉండవచ్చు. **'తల్లఖ్‌తుమ్'** అంటే విడాకులివ్వాలని గట్టిగా సంకల్పించుకున్నప్పుడు అని ఇక్కడ భావం.

2. ఈ వాక్యంలో విడాకులు ఇవ్వవలసిన పద్ధతి, విడాకులు ఇవ్వవలసిన సమయం గురించి చెప్పబడింది. గడువు ప్రారంభంలో విడాకులివ్వాలి. అంటే, భార్య బహిష్టు అనంతరం పరిశుద్ధతను పొందిన మీదట ఆమెతో సంభోగించకుండానే విడాకులు ఇవ్వాలి. అంటే, పరిశుద్ధావస్థ ఆమె గడువు (ఇద్దత్)కు ఆరంభం అన్నమాట. దీన్నిబట్టి తెలిసేదేమంటే బహిష్టు స్థితిలోగానీ, లేక ఆ తర్వాత ఆమెతో పడక సుఖం పొందిన తరువాత గానీ విడాకులు ఇవ్వటం తప్పుడు పద్ధతి. దీన్ని ధర్మవేత్తలు 'అనుచితమైన విడియాకు' (తలాఖె బిదయీ)గా, ముందుగా పేర్కొనబడిన పద్ధతిని 'తలాఖె సున్నత్'గా అభివర్ణించారు. ఈ విషయాన్ని సమర్ధించే హదీసు కూడా ఉంది. దీని ప్రకారం హ్రజత్ ఇబ్నె ఉమర్ (రజి) తన భార్యకు అశుద్ధావస్థలో విడాకులిచ్చారు. ఈ సంగతి తెలిసినప్పుడు దైవప్రవక్త (సఅసం) ఆగ్రహోదగ్రులయ్యారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పరిశుద్ధస్థితిలో విడాకులివ్వవలసిందిగా ఆయనకు ఆదేశించారు. ఈ సందర్భంగా దైవప్రవక్త (స) ఈ ఆయతును ఉదాహరించారు (సహీహ్ బుఖారీ – కితాబుత్తలాఖ్). అయితే అశుద్ధావస్థలో ఇవ్వబడిన విడియాకు – అది అనుచితమైన పద్ధతి అయినప్పటికీ – విడాకు (అయిపోయినట్లు)గానే పరిగణించబడుతుంది. హదీసువేత్తల, అత్యధిక మంది పండితుల అభిప్రాయం కూడా ఇదే. అయితే ఇమామ్ ఇబ్నె ఖయ్యిమ్, ఇమామ్ ఇబ్నె తైమియ వంటి విద్వాంసులు మాత్రం ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. అనుచిత పద్ధతిలో ఇవ్వబడిన తలాఖ్ నిజంగా తలాఖ్ కాజాలదని వారు గట్టిగా వాదించారు. (వివరాలకు 'నైలుల్ అవ్‌తార్' గ్రంథం లోని విడాకుల ప్రకరణాన్ని చూడగలరు).

الْعِدَّةَ ۚ وَاتَّقُوا اللَّهَ رَبَّكُمْ ۖ لَا تُخْرِجُوهُنَّ مِنْ بُيُوتِهِنَّ وَلَا يَخْرُجْنَ
إِلَّا أَنْ يَأْتِينَ بِفَاحِشَةٍ مُبَيِّنَةٍ ۚ وَتِلْكَ حُدُودُ اللَّهِ ۚ وَمَنْ يَتَعَدَّ
حُدُودَ اللَّهِ فَقَدْ ظَلَمَ نَفْسَهُ ۚ لَا تَدْرِي لَعَلَّ اللَّهَ يُحْدِثُ بَعْدَ

(రుతువు)ను లెక్కిస్తూ ఉండండి.[3] మీ ప్రభువైన అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు వారిని వారి ఇండ్ల నుండి గెంటివేయకండి,[4] వారు సయితం వెళ్ళి పోకూడదు.[5] ఒకవేళ వారు బాహాటంగా ఏదైనా నీతిబాహ్యమైన చేష్టకు ఒడిగడితే (అప్పుడు వెళ్ళగొట్టవచ్చు).[6] ఇవి అల్లాహ్ నిర్ధారించిన హద్దులు. ఎవరయితే అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమిస్తాడో అతడు తన స్వయానికే అన్యాయం చేసు కున్నవాడవుతాడు.[7] నీకు తెలీదు–బహుశా

3. అంటే రుతువు ఆరంభాన్ని, ముగింపును ఖచ్చితంగా లెక్కిస్తూ ఉండాలి. ఎందుకంటే గడువు (ఇద్దత్) ముగిసిన వెంటనే ఆ స్త్రీ పునర్వివాహానికి ధర్మపరంగా పరిస్థితి స్పష్టంగా ఉండాలి. లేదా ఒకవేళ మీరే ఆమె వైపు మరలదలిస్తే గడువు ముగియక ముందే మరలేందుకు వీలుగా 'లెక్క' అవసరం. (అంటే మొదటి లేక రెండవ విడియాకు తరువాత ఆమెను తిరిగి రప్పించుకోవటానికి అవకాశం ఉంటుంది. మూడవ విడియాకు కూడా ఇచ్చేస్తే ఇక ఆ దాంపత్య సంబంధాన్ని పునరుద్ధరించే ద్వారాలన్నీ దాదాపు మూసుకు పోయినట్లే).

4. అంటే – విడియాకు (తలాఖ్) ఇచ్చినంతనే ఆమెను తమ ఇంటినుండి గెంటివేయ కూడదు. పైగా గడువు ముగిసే వరకు ఆమెను సాదరంగా తమ ఇంట్లోనే ఉంచాలి. అప్పటివరకూ వారికి ఉత్తమ రీతిలో అన్నవస్త్రాలు, మనోవర్తి ఇవ్వాలి.

5. ఈ గడువు కాలంలో విడాకులు పొందిన మహిళలు కూడా వారి ఇండ్ల నుంచి వెళ్ళి పోకూడదు – మరీ ఏదన్నా అవసరం ఏర్పడితే తప్ప!

6. ఒకవేళ ఈ గడువు కాలంలో ఆమె ఏదైనా సిగ్గుమాలిన పనికి పాల్పడినా లేక నోరు పారేసుకున్నా లేక కుటుంబ పరువును మంటగలిపే పోకడలకు పాల్పడినా – అట్టి పరిస్థితిలో ఆమెను ఇంటినుంచి పంపివేయవచ్చు.

7. అంటే, ఇప్పటివరకూ విడాకుల విషయంలో చెప్పబడినవన్నీ దైవం నిర్ణయించిన హద్దులు. వీటికి కట్టుబడి ఉండటం విధి. ఒకవేళ ఎవరయినా ఈ హద్దుల్ని అతిక్రమిస్తే వారు తమ స్వయానికే అన్యాయం చేసుకున్నారన్నమాట! ఎందుకంటే ఈ అతిక్రమణ మూలంగా వాటిల్లే ప్రాపంచిక, ధార్మిక నష్టాలను వారే భరించవలసి ఉంటుంది.

| | |
|---|---|
| అల్లాహ్ దీని తరువాత ఏదైనా కొత్త పరిస్థితిని కల్పిస్తాడేమో![8] | ذٰلِكَ اَمۡرًا ① |

8. అంటే – విడాకులు (ఒకటి లేక రెండు విడాకులు అప్పటికే) పొందివున్న భార్యపట్ల భర్త హృదయంలో ప్రేమానురాగాలను సృజిస్తాడేమో! బహుశా భర్త ఆమెను తిరిగి కాపురానికి రప్పించుకుంటాడేమో! ఎందుకంటే మొదటి లేక రెండవ విడాకుల తర్వాత కూడా భర్తకు ఆమెను కాపురానికి రప్పించుకునే అవకాశం ఇవ్వబడింది. అందుకే కొంతమంది విద్వాంసుల అభిప్రాయం ప్రకారం ఈ ఆయతులో దేవుడు ఒక సమయంలో కేవలం ఒక్క 'తలాఖ్' మాత్రమే ఇవ్వాలని తాకీదు చేశాడు. ఒకేసారి మూడు విడాకులు ఇవ్వటాన్ని వారించాడు. ఎందుకంటే అతను ఒకేసారి మూడు విడాకులు ఇవ్వగా (షరీఅత్ దాన్ని మూడుసార్లు విడాకులు ఇచ్చినట్లుగా పరిగణించి నట్లయితే) 'దేవుడు ఏదన్నా కొత్త స్థితిని కల్పిస్తాడేమో!' అని చెప్పాల్సిన అవసరం ఉండేదికాదు (ఫత్హుల్ ఖదీర్). దీని ఆధారంగానే తొలి రెండు విడాకులు పొందిన మహిళలకు మాత్రమే అన్నపానీయాలు, మనోవర్తి వర్తిస్తుందని ఇమామ్ అహ్మద్ తదితర ఇమాములు సూత్రీకరించారు. ఎందుకంటే అట్టి పరిస్థితిలోనే విడాకులిచ్చిన భర్తలకు తమ స్త్రీలను తిరిగి పిలిపించుకునే అధికారం ఉంటుంది. మూడవసారి విడాకులు పొందిన మీదట ఇక ఆ స్త్రీకి తన మాజీ భర్త నుంచి ఎలాంటి మనోవర్తి లభించదు. మూడవసారి విడియాకు పొందాక ఆమెను తక్షణం భర్త ఇంటి నుంచి తరలించటం జరుగుతుంది. ఎందుకంటే భర్త ఇక ఆమెను కాపురానికి తిరిగి రప్పించుకునే మార్గాలన్నీ మూసుకుపోయాయి. అందువల్ల ఆమె అన్నవస్త్రాల నిమిత్తంగానీ, మనోవర్తి నిమిత్తంగానీ – తనకు సంబంధంలేని – మాజీ భర్త నుంచి ఎలాంటి డిమాండూ చేయజాలదు.

హజ్రత్ ఫాతిమా బిన్తె ఖైస్ (ర.అన్హా) సంఘటన ద్వారా కూడా ఈ విధానానికి సమర్థన లభిస్తోంది. ఆమె భర్త ఆమెకు మూడవ (చివరి) విడియాకు ఇచ్చిన మీదట, ఆమెను ఇల్లు ఖాళీ చేయవలసిందిగా సూచించబడింది – దానికామె ససేమిరా అంది. ఎట్టకేలకు ఆ వ్యవహారం దైవప్రవక్త (స) దాకా వెళ్ళింది. ఆమెకు ఇంటి వసతిగానీ, మనోవర్తిగానీ లభించదని దైవప్రవక్త (స) తీర్పు యిచ్చారు. వెంటనే ఆమె ఇల్లు విడిచిపెట్టవలసిందిగా కూడా ఆయన (స) ఆదేశించారు. కొన్ని ఉల్లేఖనాలలోనయితే భర్త రాజీ పడటానికి హక్కు ఉన్న స్త్రీకి మాత్రమే మనోవర్తి, ఇంటి వసతి లభిస్తుందని స్పష్టంగా ఉంది (అహ్మద్, నసాయి). అలాగే గర్భవతులైన మహిళలకు మనోవర్తి, ఇంటి వసతి లభిస్తుందని కూడా కొన్ని ఉల్లేఖనాల్లో

فَإِذَا بَلَغْنَ أَجَلَهُنَّ فَأَمْسِكُوهُنَّ بِمَعْرُوفٍ أَوْ فَارِقُوهُنَّ
بِمَعْرُوفٍ وَأَشْهِدُوا ذَوَيْ عَدْلٍ مِنْكُمْ وَأَقِيمُوا الشَّهَادَةَ لِلَّهِ
ذَٰلِكُمْ يُوعَظُ بِهِ مَنْ كَانَ يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ وَمَنْ يَتَّقِ
اللَّهَ يَجْعَلْ لَهُ مَخْرَجًا ﴿٢﴾

**2** మరి ఆ స్త్రీలు తమ గడువు (ఇద్దత్)కు చేరుకున్నప్పుడు వారిని ఉత్తమ రీతిలో మీ వివాహబంధంలోనయినా ఉంచుకోండి. లేదంటే ఉత్తమరీతిలో వారిని వేర్పరచట మైనా చేయండి.[9] మీలోని న్యాయశీలురైన ఇద్దరు వ్యక్తుల్ని సాక్షులుగా పెట్టుకోండి.[10] అల్లాహ్ కొరకు సరైన సాక్ష్యాన్ని నెల కొల్పండి.[11] అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించేవానికి ఇందు మూలముగా ఉపదేశించబడుతోంది. ఎవడయితే అల్లాహ్‌కు భయపడుతూ మసలుకుంటాడో అతనికి అల్లాహ్ (ఈ సంక్షోభం నుండి) బయటపడే మార్గం కల్పిస్తాడు.[12]

وَيَرْزُقْهُ مِنْ حَيْثُ لَا يَحْتَسِبُ وَمَنْ يَتَوَكَّلْ عَلَى اللَّهِ فَهُوَ حَسْبُهُ

**3** అతను ఊహించనయినాలేని చోటు నుండి అతనికి ఉపాధిని సమకూరుస్తాడు. అల్లాహ్‌పై భారం మోపిన వానికి అల్లాహ్‌యే చాలు. అల్లాహ్ తన కార్యాన్ని

చెప్పబడింది. (దీని వివరాల కోసం నైలుల్ అవ్‌తార్ గ్రంథాన్ని చూడండి). కొంత మంది ఈ ఉల్లేఖనాలను "వారిని ఇండ్లనుండి తీసివేయకండి" అన్న దైవాదేశానికి విరుద్ధంగా ఖరారుచేసి, వాటిని కొట్టివేస్తుంటారు. ఇది సరైనది కాదు. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్‌లోని ఈ దైవాదేశం మొదటి రెండు విడాకులకు సంబంధించినది. మూడవ విడియాకు తర్వాత భర్తతో సంబంధం పూర్తిగా తెగిపోతుంది.

9. సంభోగానంతరం విడాకులు ఇవ్వబడిన స్త్రీ గడువు (ఇద్దత్) మూడు రుతువులు. ఒకవేళ ఆమెను తిరిగి కాపురానికి రప్పించదలచుకుంటే గడువు ముగియకముందే రప్పించుకోవాలి. అన్యథా ఆమెను ధర్మప్రకారం – ఉత్తమ రీతిలో – వదలిపెట్టాలి.

10. మీరు ఆమెను తిరిగి రప్పించగోరినా లేక కొంతమంది ప్రకారం ఆమెకు విడియాకులు ఇవ్వదలచినా ఈ మొత్తం వ్యవహారంపై నమ్మకస్థులైన ఇద్దరు వ్యక్తులను సాక్షులుగా పెట్టుకోవాలి. సాక్షుల్ని నియమించుకోవటం తప్పనిసరి ఏమీ కాదుగాని సాక్షులుంటే మంచిదే కదా!

11. సాక్షులు నిష్పక్షపాతంగా, ధైర్యంగా సాక్ష్యం ఇచ్చేవారై ఉండాలి. వారెలాంటి

إن الله بالغ أمره قد جعل الله لكل شيء قدرا ③

చేసి తీరుతాడు.[13] అల్లాహ్ ప్రతి విషయానికీ ఒక లెక్కను నిర్ధారించాడు.[14]

والّٰئي يئسن من المحيض من نسائكم إن ارتبتم فعدتهن
ثلٰثة أشهر والّٰئي لم يحضن وأولات الأحمال أجلهن أن يضعن
حملهن ومن يتق الله يجعل له من أمره يسرا ④

**4** మీ స్త్రీలలో ముట్టుపై ఆశ వదులుకున్న వారి విషయంలో మీకేదైనా సందేహముంటే, వారి గడువు మూడు నెలలు. రజస్వల (రుతుస్రావం మొదలు) కాని వారి గడువు కూడా అంతే.[15] గర్భవతుల గడువు వారి ప్రసవం అయ్యేవరకూ ఉంటుంది.[16] ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతనికి అల్లాహ్ అతని వ్యవహారంలో అన్ని విధాలా సౌలభ్యం కల్పిస్తాడు.

ذٰلك أمر الله أنزله إليكم ومن يتق الله يكفر عنه سيّاٰته
ويعظم له أجرا ⑤

**5** ఇది అల్లాహ్ ఆజ్ఞ. దీన్ని ఆయన మీ వైపు అవతరింపజేశాడు. ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతని పాపాలను అల్లాహ్ అతని నుండి రూపుమాపుతాడు. అతనికి గొప్ప పుణ్యఫలాన్ని వొసగుతాడు.

---

రాగద్వేషాలకు, ప్రలోభాలకు లొంగకుండా విషయాన్ని ఉన్నదున్నట్టు చెప్పేవారై ఉండాలి.

12. అంటే పరిస్థితుల క్లిష్టస్వరూపం నుండి, కఠిన పరీక్షల నుండి గట్టెక్కే అవకాశం కల్పిస్తాడు.

13. అంటే – ఆయన అనుకున్నదల్లా చేస్తాడు. ఆయన నిర్ణయాన్ని, సంకల్పాన్ని ఎవరూ అడ్డుకోలేరు.

14. కష్టాల విషయంలోనయినా, సుఖాల విషయంలోనయినా ఆయన ఒక హద్దు పెట్టాడు. అవి ఆ హద్దువరకే ఉంటాయి. మరికొంతమంది వ్యాఖ్యాతలు ఈ వాక్యం రుతుచక్రానికి, గడువుకు వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు.

15. అంటే – వయసు పైబడిన కారణంగా బహిష్టు ఆగిపోయిన స్త్రీలు, అసలు రుతుస్రావమే మొదలుకాని స్త్రీలు కూడా. స్త్రీలలో చాలా అరుదుగా జరిగే విశేషమేమిటంటే వారు యుక్త వయస్సుకు చేరినప్పటికీ రజస్వల కారు. అలాంటి స్త్రీల విషయంలో కూడా కనీసం మూడు నెలల కాలం ఆగి ఉండాల్సిందేనని సూచించబడింది.

**6** మీ స్థోమత మేరకు మీరు ఉండే చోటే (విడాకులు పొందిన) ఆ మహిళలను కూడా ఉండనివ్వండి.[17] వారిని ఇబ్బందులపాలు చేసే ఉద్దేశంతో బాధించకండి.[18] ఒకవేళ వారు గర్భవతులై ఉంటే, వారు శిశువును కనేవరకూ వారికి

أَسْكِنُوهُنَّ مِنْ حَيْثُ سَكَنتُم مِّن وُجْدِكُمْ وَلَا تُضَارُّوهُنَّ لِتُضَيِّقُوا
عَلَيْهِنَّ وَإِن كُنَّ أُولَاتِ حَمْلٍ فَأَنفِقُوا عَلَيْهِنَّ حَتَّىٰ يَضَعْنَ حَمْلَهُنَّ

16. విడాకులు పొందిన మహిళ ఒకవేళ గర్భవతి అయివుంటే ఆమె ప్రసవం దాకా ఆగాలి. విడాకులివ్వబడిన రెండో రోజు కాన్పు అయినా గడువు ముగిసినట్లే. ఈ ఆయతు ద్వారా తెలిసే మరో ముఖ్యాంశం ఏమిటంటే గర్భవతిగా ఉన్న మహిళ – ఆమె విడాకులు పొందినా లేక ఆమె భర్త చనిపోయినా – కాన్పు అయిన వెంటనే ఆమె ఇద్దత్ (గడువు) ముగుస్తుంది. హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది (వివరాలకు సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలు చూడండి). అయితే గర్భవతులు కాని మహిళల భర్తలు గనక చనిపోతే వారి ఇద్దత్ (గడువు) నాలుగు మాసాల పదిరోజులు (అల్ బఖరా సూరా – 234).

17. అంటే మొదటి రెండు విడాకులు ఇవ్వబడిన మహిళలను అన్నమాట. చివరిసారి (మూడవసారి) విడాకులిచ్చేశాక వారికి వసతి సౌకర్యంగానీ, మనోవర్తిగానీ ఇవ్వబడదు. స్థోమతకు తగ్గవిధంగా ఉండనివ్వటమంటే భావం, ఇల్లు విశాలంగా ఉండి అందులో అనేక గదులున్నప్పుడు, ఒక గదిని ఆమె కొరకు ప్రత్యేకంగా కేటాయించాలి. లేదా మగవారు తాముండేగదిని ఖాళీచేసి, దాన్ని ఆమెకు ప్రత్యేకించాలి. వారిని దగ్గరలోనే ఉంచి ఇద్దత్ (గడువు)ని గడపటం వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమిటంటే ఆ దంపతుల మధ్య ఆవేశం తగ్గి ఆలోచన కలగవచ్చు. ఈలోగా సదవగాహన పెంపొంది వారుభయులు రాజీకి కూడా రావచ్చు. అప్పటికే వారికి సంతానం కలిగి ఉంటే రాజీపడటానికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది.

కాని శోచనీయమైన విషయం ఏమిటంటే ముస్లిం సోదరులు ఈ మార్గదర్శక సూత్రాన్ని అనుసరించరు. తత్కారణంగా వారు మానవ నైజం వాంఛించే ఈ మేలుకు నోచుకోకుండా పోతున్నారు. మననాట స్త్రీకి విడాకులివ్వగానే ఆమెను అంటరానిదిగా పరిగణించి, ఆమెను ఇంటి నుండి వెళ్ళగొట్టడం జరుగుతుంది. ఒక్కోసారి స్వయంగా ఆడపిల్ల తరఫువారే ఆమెను తీసుకెళ్ళిపోతుంటారు. ఈ రివాజు దివ్య ఖుర్ఆన్ ప్రబోధనలకు పూర్తిగా విరుద్ధం అని మరువరాదు.

18. అంటే – మనోవర్తిని చెల్లించటంలోనూ, ఇంటి సదుపాయం కల్పించటంలోనూ వారిని నానా ఇక్కట్లకు గురిచేసి, వారు ఇల్లు వదిలి వెళ్ళిపోయేలా చేయకూడదు.

మరి కొంతమంది ఈ వాక్యానికి చెప్పిన భావం ఇది : "గడువు (ఇద్దత్)

ఖర్చులు ఇస్తూ ఉండండి.[19] ఆ తరువాత వారు – మీ అభ్యర్థనపై – బిడ్డకు పాలిచ్చి నట్లయితే వారికి వారి ప్రతిఫలాన్ని ముట్ట జెప్పండి.[20] ధర్మానుసారం పరస్పరం సంప్రతించుకోండి.[21] ఒకవేళ మీరు పరస్పరం గొడవపడినట్లయితే అతని కోరికపై మరొకామె బిడ్డకు పాలుపడు తుంది.[22]

فَإِنْ أَرْضَعْنَ لَكُمْ فَآتُوهُنَّ أُجُورَهُنَّ ۖ وَأْتَمِرُوا بَيْنَكُم بِمَعْرُوفٍ ۖ وَإِن تَعَاسَرْتُمْ فَسَتُرْضِعُ لَهُ أُخْرَىٰ ⑥

**7** స్థోమత ఉన్నవాడు తన స్థోమతకు తగ్గట్టుగా ఖర్చుచేయాలి.[23] మరెవరికయితే

لِيُنفِقْ ذُو سَعَةٍ مِّن سَعَتِهِ ۖ وَمَن قُدِرَ عَلَيْهِ رِزْقُهُ فَلْيُنفِقْ مِمَّا آتَاهُ

పూర్తవబోతుండగా వారిని తిరిగి కాపురానికి రప్పించుకుని, మరి కొన్నాళ్ళకు మళ్లీ విడాకులిచ్చి సతాయించరాదు. పూర్వం అజ్ఞానకాలంలో మగవారు ఆడవారిని ఇలాగే వేధించేవారు. ఈ అన్యాయాన్ని అరికట్టేందుకు ఇస్లామీయ షరీయతు కొన్ని నిర్ణీత కట్టుబాట్లను నిర్ధారించింది. వీటి ప్రకారం ఒక మగవాడు తన భార్యకు మొదటి రెండు విడియాకులు ఇచ్చిన పరిస్థితిలో మాత్రమే ఆమెను తిరిగి రప్పించుకునే అధికారం కలిగి ఉంటాడు. మూడవసారి విడాకులిచ్చాక శాశ్వతంగా విడిపోవలసి ఉంటుంది.

19. ఒకవేళ విడాకులు పొందిన మహిళ గర్భవతి అయివుంటే – ఆమెకు మూడవసారి విడాకులు ఇవ్వబడినాసరే – ప్రసవించే వరకూ ఆమెకు ఇంటి వసతిని కల్పించటంతో పాటు, ఆమెకు అన్నవస్త్రాలు కూడా సమకూర్చవలసిందే.

20. విడాకులు పొందిన తరువాత కూడా ఆమె మీ బిడ్డకు పాలిచ్చినట్లయితే మీరు ఆమెకు వేతనం చెల్లించవలసి ఉంటుంది.

21. అంటే – పరస్పర సంప్రతింపుల ద్వారా ఉభయులూ వేతనం తదితర విషయాలను నిర్ధారించుకోవచ్చు. ఉదాహరణకు : పిల్లవాని తండ్రి అతని స్థాయికి తగ్గట్టు వేతనం చెల్లించాలి. విడాకులు పొందిన మహిళ కూడా ఆ బిడ్డ తండ్రి నుండి తగిన రీతిలోనే వేతనాన్ని డిమాండు చేయాలి. ఈ సందర్భంగా ఇరువురిలో ఏ ఒక్కరు కూడా అనుచితమైన ధోరణిని అవలంబించకూడదు.

22. ఒకవేళ వారిద్దరూ పరస్పరం ఒక అంగీకారానికి రాలేకపోతే – అట్టి పరిస్థితిలో –

اللّٰهُ لَا يُكَلِّفُ اللّٰهُ نَفْسًا اِلَّا مَاۤ اٰتٰىهَا ۚ سَيَجْعَلُ اللّٰهُ بَعْدَ عُسْرٍ يُّسْرًا ۝

అతని ఉపాధి కుదించబడిందో,[24] అతను అల్లాహ్ తనకు ప్రసాదించిన దానిలో నుంచి (తన స్థాయికి తగ్గట్టుగానే) ఖర్చు పెట్టాలి. అల్లాహ్ ఏ ప్రాణిపైనా దానికి ఇచ్చిన దానికంటే ఎక్కువ భారం మోపడు.[25] అల్లాహ్ ఇబ్బందుల తరువాత సౌలభ్యాన్ని కూడా కల్పిస్తాడు.[26]

وَكَاَيِّنْ مِّنْ قَرْيَةٍ عَتَتْ عَنْ اَمْرِ رَبِّهَا وَرُسُلِهٖ فَحَاسَبْنٰهَا حِسَابًا شَدِيْدًا ۙ وَّعَذَّبْنٰهَا عَذَابًا نُّكْرًا ۝

**8** ఎన్నో జనపదాలవారు తమ ప్రభువు ఆజ్ఞపట్ల, ఆయన ప్రవక్తల పట్ల తిరుగుబాటు ధోరణిని[27] అవలంబించిన కారణంగా మేము కూడా వారి నుండి కఠినంగా లెక్క తీసుకున్నాము. కానరాని రీతిలో వారిని దెబ్బతీశాము.[28]

మగవాడు మరెవరి చేతనయినా ఆ బిడ్డకు పాలుపట్టే ఏర్పాటు చేయించవలసి ఉంటుంది.

23. అంటే – పాలుపట్టే స్త్రీలకు శక్తికి తగ్గట్టుగా వేతనం ఇవ్వాలి. ఒకవేళ దేవుడు బిడ్డ తండ్రికి సిరిసంపదల్ని పుష్కలంగా ప్రసాదించివుంటే, అతను తన అంతస్తుకు తగినట్లుగానే ఆయాలకు వేతనం చెల్లించాలి.

24. ఒకవేళ బిడ్డతండ్రి ఆర్థికంగా బలహీనుడై ఉంటే అతను తన స్థాయికి తగ్గట్టుగానే ఇవ్వాలి.

25. అందువల్ల ఆయన బలహీనుడైన వ్యక్తిపై కూడా స్థాయికి మించిన వేతనాన్ని వడ్డించి అతన్ని కష్టాలపాల్జేయడు. కాబట్టి బిడ్డతండ్రి అయినా, బిడ్డ తల్లి అయినా ఈ సందర్భంగా ధర్మబద్ధంగా మసలుకుంటే ఏ గొడవా ఉండదు. ఆ విషయమే మరొకచోట ఈ విధంగా చెప్పబడింది : "బిడ్డను కన్న కారణంగా తల్లి మీద ఎక్కువ భారం మోపటం భావ్యం కాదు. బిడ్డకు తండ్రి కనుక తండ్రిని ఇరకాటంలో పెట్టడం కూడా సమంజసం కాదు." (అల్ బఖర : 233)

26. కాబట్టి, ఎవరయితే అల్లాహ్‌పై పూర్తిగా ఆధారపడి, ధర్మసమ్మతంగా మసలుకుంటారో వారికి అల్లాహ్ ఆర్థికంగా వెసులుబాటును కూడా కల్పిస్తాడు.

27. అంటే ధర్మాధర్మాలకు సంబంధించి వారిపై విధించబడిన కట్టుబాట్లను వారు లెక్కచేయకుండా, బరితెగించిపోయిన కారణంగా...

28. మూలంలో హిసాబ్ (లెక్క), అజాబ్ (శిక్ష) – అని రెండు పదాలు వచ్చాయి. ఈ

فَذَاقَتْ وَبَالَ أَمْرِهَا وَكَانَ عَاقِبَةُ أَمْرِهَا خُسْرًا ﴿٩﴾

**9** అంతే! వారు తమ కర్మల దుష్ఫలి తాన్ని చవిచూశారు. చివరకు వారికి మిగిలింది తీవ్రనష్టమే.

أَعَدَّ اللَّهُ لَهُمْ عَذَابًا شَدِيدًا ۖ فَاتَّقُوا اللَّهَ يَا أُولِي الْأَلْبَابِ ۚ
الَّذِينَ آمَنُوا ۚ قَدْ أَنزَلَ اللَّهُ إِلَيْكُمْ ذِكْرًا ﴿١٠﴾

**10** వారి కోసం అల్లాహ్ కఠినమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. కనుక విశ్వసించిన ఓ విజ్ఞులారా! అల్లాహ్‌కు భయపడండి. నిశ్చయంగా అల్లాహ్ మీ వైపు హితబోధను పంపాడు.

رَسُولًا يَتْلُو عَلَيْكُمْ آيَاتِ اللَّهِ مُبَيِّنَاتٍ لِّيُخْرِجَ الَّذِينَ آمَنُوا
وَعَمِلُوا الصَّالِحَاتِ مِنَ الظُّلُمَاتِ إِلَى النُّورِ ۚ وَمَن يُؤْمِن بِاللَّهِ وَيَعْمَلْ
صَالِحًا يُدْخِلْهُ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا أَبَدًا ۖ
قَدْ أَحْسَنَ اللَّهُ لَهُ رِزْقًا ﴿١١﴾

**11** (అనగా) అల్లాహ్ యొక్క స్పష్టమైన వాక్యాలను (ఆదేశాలను) చదివి వినిపించి, విశ్వసించి సత్కార్యాలు చేసినవారిని ఆయన కారు చీకట్లలో నుండి వెలుగు లోనికి తీసుకువచ్చేందుకు[29] ఒక ప్రవక్తను పంపాడు. మరెవరయితే అల్లాహ్‌ను విశ్వసించి సదాచరణచేస్తారో[30] వారిని అల్లాహ్ క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలలో ప్రవేశింపజేస్తాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. నిశ్చయంగా అల్లాహ్ అతనికి అత్యుత్తమమయిన ఉపాధిని వొసగాడు.

---

రెండూ ప్రాపంచికమైన శిక్షల్నే సూచిస్తున్నాయి. లేక కొంతమంది అభిప్రాయం ప్రకారం 'అజాబన్ నుక్రా' అంటే కరువుకాటకాలు, భూమిలో కూరుకుపోవటం లాంటి ప్రాపంచికమైన శిక్షలు కాగా; హిసాబన్ షదీదా (గట్టి లెక్క) పరలోకానికి సంబంధించిన శిక్ష (ఫత్‌హుల్ ఖదీర్).

29. ఈ వాక్యంలో దైవప్రవక్త బాధ్యతలు తెలుపబడ్డాయి. దైవప్రవక్త (స) దైవగ్రంథమైన ఖుర్ఆన్ ద్వారా ప్రజలను నైతిక అధోగతి నుండి, బహుదైవారాధన, మార్గభ్రష్టత్వం అనే అంధకారం నుండి వెలికితీసి విశ్వాసం, సదాచరణ అనే కాంతిశిఖరాల ఉన్నతికి చేరుస్తారు. ఇక్కడ దైవప్రవక్త అంటే అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) అని భావం.

30. సత్కార్యాలు (అమలె సాలెహ్) అన్న పదంలో రెండు విషయాలు అంతర్లీనమై ఉన్నాయి:

**12** అల్లాహ్ – ఆయనే సప్తాకాశాలనూ, అలాంటివే భూములను[31] సృష్టించిన వాడు. ఆయన ఆజ్ఞ వాటి మధ్య అవత రిస్తుంది[32]–అల్లాహ్ అన్నింటిపై అధికారం కలిగి ఉన్నాడనీ, ఇంకా అల్లాహ్ తన జ్ఞానంతో అన్నింటినీ పరివేష్ఠించి ఉన్నా డని మీరు తెలుసుకోవటానికి.[33]

اَللّٰهُ الَّذِيْ خَلَقَ سَبْعَ سَمٰوٰتٍ وَّمِنَ الْاَرْضِ مِثْلَهُنَّ ۭ يَتَنَزَّلُ الْاَمْرُ بَيْنَهُنَّ لِتَعْلَمُوْٓا اَنَّ اللّٰهَ عَلٰي كُلِّ شَيْءٍ قَدِيْرٌ ڏ وَّاَنَّ اللّٰهَ قَدْ اَحَاطَ بِكُلِّ شَيْءٍ عِلْمًا ⑫

1. దైవాదేశాల, విధుల పాలన. 2. పాపకార్యాలను, అధర్మ విషయాలను విడనాడటం. అంటే కేవలం నోటితో విశ్వాస ప్రకటన చేయటంతోనే సరిపుచ్చకుండా – విశ్వాసం వాంఛించే సదాచరణ కూడా చేసి, పాపాలకు దూరంగా మసలుకున్న విశ్వాసి మాత్రమే స్వర్గంలో ప్రవేశిస్తాడన్నమాట!

31. ఏడు ఆకాశాల మాదిరిగా ఏడు భూములను కూడా ఆయన సృష్టించాడు. కొందరు ఏడు భూములు అంటే ఏడు ఖండాలు అని అభిప్రాయపడ్డారు. కాని ఇది సరైనది కాదు. ఒక భూమండలానికి – మరో భూమండలానికి మధ్య పెద్ద అంతరం ఉంది. ప్రతి భూమండలంలోనూ దేవుని జీవరాసులున్నాయి (ఖుర్తుబీ). హదీసుల ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ఉదాహరణకు : ఒకసారి మహాప్రవక్త (స) ఇలా అన్నారు : "ఎవరయినా ఇతరులకు చెందిన ఒక జానెడు నేలను ఆక్రమించు కున్నా ప్రళయ దినాన ఆ నేలంతటి భాగం ఏడు భూమండలాల నుండి గుది బండగా తయారుచేసి అతని మెడలో వేయటం జరుగుతుంది." (సహీహ్ ముస్లిం – కితాబుల్ బుయూ). 'అతన్ని ఏడు భూముల లోతుకి కూర్చివేయటం జరుగుతుంది' అని బుఖారీలో ఉంది (సహీహ్ బుఖారీ, కితాబుల్ మజాలిమ్). ప్రతి భూమండలం లోనూ ఈ భూమండలం వంటి ప్రవక్తలే వస్తూ ఉండేవారని కూడా కొందరు చెబుతారు. అంటే ఆదం కాలంలో ఆదం, నూహ్ కాలంలో నూహ్ ప్రవక్త – ఈ విధంగా! కాని ఈ విషయానికి ప్రామాణికమైన ఆధారాలేవీ లేవు.

32. ప్రతి ఆకాశంపై అల్లాహ్ ఆజ్ఞ ప్రవేశపెట్టబడినట్లే, ప్రతి భూమండలంపై అల్లాహ్ ఆజ్ఞ చెల్లుతుంది. ఆకాశాల మాదిరిగానే భూమండలాలకు సంబంధించి కూడా ఆయన వ్యూహరచన చేస్తుంటాడు.

33. ఆయన గ్రహణా పరిధిలో లేని విషయమంటూ ఏదీ లేదు. ప్రతిదీ ఆయన జ్ఞానంలో ఇమిడి ఉంది.